## క్లుప్తంగా

### వాకర్స్ క్లబ్‌కు ఫర్నిచర్ వితరణ



రిబ్బన్ కట్ చేసి వాకర్స్ క్లబ్‌కు ఫర్నిచర్ అందిస్తున్న కమల్ బైద్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌కు అవసరమైన ఫర్నిచర్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో డాక్టర్ కమల్ బైద్ విరాళంగా అందించా రు. పార్కులో కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన కుర్చీలు, బెంచీలు సమకూర్చాలని వాకర్స్ క్లబ్ సభ్యులు కోరిన మేరకు ఆయన 50 కుర్చీలు, నాలుగు స్టీల్ బెంచీలను సమకూర్చారు. ఈ ఫర్నిచర్‌ను ఆదివారం రిబ్బన్ కట్ చేసి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావులకు కమల్ బైద్ అందించారు. ఈ సందర్భంగా ఆయనకు వాకర్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### 'వైశాఖి దివ్యాంగ సేవా' ట్రస్టు సమావేశం



మాట్లాడుతున్న ట్రస్టు అధ్యక్షుడు శ్రీమన్నారాయణ

సీతంపేట: వైశాఖి దివ్యాంగ విద్యార్థి సేవా చారిటబుల్ ట్రస్టు సర్వసభ్య సమావేశం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ట్రస్టు కార్యదర్శి సోమేశ్వరరావు, కోశాధికారి లక్ష్మీనారాయణ గతేడాది ట్రస్టు ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలు, జమా ఖర్చులను వివరించారు. ట్రస్టు అధ్యక్షుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రాబోయే ఏడాదిలో చేపట్టనున్న కార్యక్రమాలు, మార్పుల గురించి తెలియజేశారు. ముందుగా దివంగత బి.ఎస్.ఆర్.మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సభ్యులంతా పాత కార్యవర్గాన్నే మళ్లీ కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. కార్యక్రమంలో వివేకానంద, ఎం.ఆర్.పట్నాయక్, డీజీఎం జగదీశ్వరరావు, సోమసుందర్, జగదీష్‌బాబు, భగ్గం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### 48వ వార్డు సమస్యలపై వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డులో వెనుకబడిన సామాజిక వర్గాలకు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, కొండవాలు ప్రాంతాల్లోని చీకటి ప్రదేశాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ గంకల కవిత కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు కార్పొరేటర్ కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు అప్పారావు యాదవ్, వార్డు ప్రజలు వినతిపత్రాలు అందించారు.

### సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ ఉమాకాంత్ సూచించారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. హద్దులు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

### 50వ వార్డు అధ్యక్షుడిగా వరప్రసాద్

మురళీనగర్: తెలుగుదేశం పార్టీ 50వ వార్డు అధ్యక్షుడిగా సనపల వరప్రసాద్ నియమితుడయ్యారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనకు వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

### పేకాట శిబిరంపై దాడి

- పోలీసుల అదుపులో 9 మంది పేకాటరాయుళ్లు

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. స్థానిక పట్టాభిరెడ్డి గార్డెన్స్ భాస్కర్ రెసిడెన్సీలో ఆదివారం గుట్టుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్న బృందంపై ఐదో పట్టణ పోలీసులు దాడి చేసి పేకాటాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.37 వేలు నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హరిత పార్కుకు వరద బెడద

- చినుకు పడితే చెరువులా మారుతున్న సుందర ఉద్యానవన ప్రాంగణం
- కొండ దిగువన పార్కు ఉండడంతో పోటెత్తుతున్న వరద నీరు
- భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో నిలిచిపోతున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సందర్శకులు



మురళీనగర్‌లో కొండవాలు ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న హరిత పార్కు



కోతకు గురవుతున్న పార్కు లోపలి ప్రాంగణం



పార్కులో ఆట పరికరాల వద్ద నిలిచిన వర్షపు నీరు



బ్యాడ్మింటన్ కోర్టులో వరద నీరు



హరిత పార్కు ప్రవేశ గేటు



బురదతో నిండిన వాకింగ్ ట్రాక్

మురళీనగర్: మురళీనగర్‌లోని హరిత పార్కు అభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేసి ఆధునికంగా తీర్చిదిద్దినా.. వరద నీటితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. ఈ పార్కును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుందరంగా తీర్చిదిద్దింది. తర్వాతి కాలంలో జీవీఎంసీ ప్రత్యేక నిధులు మంజూరు చేసి పార్కులో అదనపు సౌకర్యాలు కల్పించింది. ఆట పరికరాలు, అదనపు జిమ్ పరికరాలు ఏర్పాటు చేసింది. ప్రధాన సమస్యలు పరిష్కరించలేదు. ముఖ్యంగా వాన నీటి తాకిడి నుంచి పార్కు రక్షణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల పార్కు అభివృద్ధికి వినియోగించిన నిధులన్నీ వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది.

**ఆహ్లాదకర పరిసరాల్లో పార్కు ఏర్పాటు**

మురళీనగర్ సెక్టార్–8లోని కొండ దిగువన హరిత పార్కును దాతల సాయంతో నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది. పరసరాలన్నీ పచ్చదనంతో కళకళలాడుతుంటాయి. మురళీ కృష్ణుడి విగ్రహం, షటిల్ కోర్టు, వాచ్‌మన్ గది, పార్కు నిర్వహణకు కార్యాలయం, వేదికల నిర్మాణానికి దాతలు సాయం చేయడంతో ఈ పార్కు ఒక రూపానికి వచ్చింది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ కల గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌ల ప్రత్యేక కృషితో ఈ పార్కును రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేశారు. వీరి చిరకాల కోరిక మట్టితో ఆధునికంగా రూపొందించిన వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. రూ.8 లక్షలతో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. గర్బ్ వాల్స్ నిర్మించడంతో అందంగా తయారైంది.

**వరద నీటితో దెబ్బతింటున్న నిర్మాణాలు**

లోపలికి ప్రవేశించగానే ఎంతో ఆహ్లాదకరంగా.. అందంగా కనిపించే ఈ పార్కును దశాబ్దాలుగా వరద నీటి సమస్య వేధిస్తోంది. ఇది కొండవాలు ప్రాంతంలో ఉండటం వల్ల వర్షాల్లో వరద నీరు పోటెత్తి పార్కులోని నిర్మాణాలు పాడవుతున్నాయి. గతంలో ఒక సారి వరద నీటి తాకిడికి రక్షణ గోడ కూలిపోయింది. దానిని పునరుద్ధరించి, లోపల ఒక వైపు మురుగు నీటి కాలువను నిర్మించినా వర్షం నీటి తాకిడి నుంచి తప్పించలేకపోతున్నారు. దీంతో వర్షాల్లో పార్కు ప్రాంగణమంతా జలమయమవుతోంది. బ్యాడ్మింటన్ కోర్టు, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటపరికరాల ప్రాంగణాల్లో వర్షం నీరు నిలిచిపోయి చెరువులా తయారవుతోంది. వేదిక ముందు భాగం కోతకు గురవుతోంది. భారీ వర్షాలకు ఆధునికంగా నిర్మించిన మట్టి వాకింగ్ ట్రాక్ పైన ఇసుక పొర కొట్టుకుపోయి బురద చేరుతోంది. దీంతో సందర్శకులు వాకింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైట్లు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలపై స్థానిక పార్కు నిర్వాహకులు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందించారు.

**తక్షణ చర్యలు అవసరం**

వరద నీటి తాకిడి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ నిర్మించి వర్షపు నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలి. ప్రహరీ వెనుక నుంచి ట్రెంచీ నిర్మించి నీరు పార్కు బయటకు పోయేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. విద్యుదీకరణ చేయాల్సి ఉంది. పార్కు గేటు నిర్మించడం, ప్రహరీ గోడకు రంగులు వేసి మ్యూరల్ ఆర్ట్‌తో అందంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు వేదిక ముందు భాగం టైల్స్‌తో నిర్మించాల్సి ఉంది. జీవీఎంసీ నిధులు మంజూరు చేస్తే పార్కు తరఫున సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని కమిటీ ప్రతినిధులు తెలియజేశారు. హరిత పార్కులో సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

### స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలి




రెడ్డి కంచరపాలెంలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం 54, 55, 56 వార్డుల పరిధి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఈవోఐని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సర్వనాశనం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ క్యాంపెయిన్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బి.పద్మ, జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, సొనబోయిన సోమేశ్వరరావు, జి.శ్రీనివాస్, బి.గంగరాజు, ఎల్లాజీ, కుమారి పాల్గొన్నారు.

## గ్రహణం ప్రభావం.. ఆలయాల మూసివేత



సీతంపేటలో మూసివేసిన దుర్గాగణపతి ఆలయం

సీతంపేట: చంద్ర గ్రహణం సందర్భంగా సీతంపేట, అక్కయ్యపాలెం పరిధిలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేశారు. దేశమంతటా చంద్రగ్రహణ ప్రభావం ఉండటంతో ఆలయాల్లో మధ్యాహ్నం నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ తర్వాత ఆలయాలను తెరిచి భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్టు ఆలయ ఈవో రమాభాయి తెలిపారు. దేవాదాయ శాఖ పరిధిలోని సీతంపేట పార్వతీశ్వరాలయం, దుర్గాగణపతి ఆలయం, అక్కయ్యపాలెం రామలింగేశ్వరాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, లలితా పీఠం, శంకరమఠం, సాయిబాబా ఆలయాలు మూసివేశారు. గ్రహణ దోష నివారణకు ఉపయోగించే దర్భగడ్డిని శంకరమఠం వద్ద విక్రయించారు.

## నవ్వులు పండించిన కామెడీ షో



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(విశాఖ, హైదరాబాద్) ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందు కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కామెడీ షో ఆద్యంతం నవ్వులు పండించింది. క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్యమి, రాగన్ నాయుడు, నరసింహారావు, సూర్య మద్రాపు, ఎస్.ఎస్.నాయుడు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో స్కూల్, డాక్టర్ పేషెంట్, ముష్టివాడు, థియేటర్, యోగా, మహిళా మండలి, గోల్డ్ మెడల్, దొందు దొందే, అందరినీ కలుస్తావు, గోవిందరావు ఇల్లు ఎక్కడ స్కిట్లు అలరించాయి. ముందుగా వాగ్దేవి నృత్యాలయం గురువు సౌందర్య సురేష్ శిష్య బృందం లక్ష్మీకార్తీక, బార్ల బైద్య, రితిక్, పి.మౌనిక చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. అతిథులు తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, బి.మాల్యాద్రి చేతుల మీదుగా కళాకారులు, చిన్నారులను సత్కరించారు.

## గౌరవ వేతనం కొనసాగించాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, ముస్లింలు

మద్రిపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల సౌకర్యార్థం మసీదులకు సంబంధించి ఇమాం, మౌజిన్‌లకు అందించే గౌరవ వేతనాన్ని కొనసాగించాలని ముస్లిం మత పెద్దలు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ తెలిపారు. వార్డు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇమాంకు రూ.10 వేలు, మౌజిన్‌కు రూ.5 వేలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా మసీద్ ఇమాం, మౌజిన్‌లకు గౌరవ వేతనం అందడం లేదని పేర్కొన్నారు. 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఇమాం, మౌజిన్‌లకు గౌరవ వేతనాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫైజల్, షరీఫ్, సౌకత్, అలీ, మునీర్ ఖాన్, మొహమ్మద్ బిలాల్, నబీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారాలు



ఉత్తమ టీచర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులు ఇందాన పూర్ణిమ, ఇందాన అనిత, దొడ్డి సంజమ్‌కుమార్, ఇ.థామస్, పి.విక్రాంత్, దులిసి లక్ష్మి, పాత్రపల్లి సునీల్‌కుమార్ తదితరులను పార్టీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ జ్ఞానాపురానికి గొప్ప పేరు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ వింగ్ రాష్ట్ర నాయకులు వేళంగిణిరావు, పాత్రపల్లి వేళంగిణిరాజు, దాలిబాని మధుకుమార్, గిడుతూరి జాన్, దాలిబాని పర్సి, వాకపల్లి మురళి, కోరాడ శౌరి, అరసాడ మధు, పాలిక కిషోర్, దేవి, ఈశ్వరి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కాళీ కాలభైరవుల కల్యాణోత్సవం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



లలితా పీఠంలో కాళీ కాలభైరవుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఆదివారం కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పీఠం దర్బారు హాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై కాళీ కాలభైవరుల ఉత్సవ మూర్తులకు కల్యాణం చేశారు. సుమూహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పీఠం పండితులు కాళీ కాలభైరవుల కల్యాణ విశిష్టతను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. తీర్థప్రసాదాలు, తలంబ్రాలను భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## వేడుకగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ఓ హోటల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వ్యాఘ్రేశ్వరుడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్ (ఫిజియోథెరపీ కాలేజీ) ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్ అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి కమిటీకి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజియో వైద్యులు, వివిధ కాలేజీల విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

## సందడిగా బాక్సింగ్ క్లబ్ వార్షికోత్సవం



విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న అతిథులు, బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం మైక్ బాక్సింగ్ క్లబ్ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథులు ద్రోణాచార్య ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీనియర్ ఉమెన్ చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, జీవోటీఏ ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదనరావు, ఏబీబీఏ జాయింట్ సెక్రటరీ ఉమా మహేశ్వరరావు, బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాక్సింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంపంగి శ్రీనివాసరావు, జి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



కొమ్మాది జంక్షన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం కొమ్మాది జంక్షన్ ఏకే ప్యాషన్స్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమ పోస్టర్‌ను సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.రాజ్‌కుమార్, టి.తిరుపతిరావు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

గోపాలపట్నం: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించబోయే యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫెడరేషన్ కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శాంతినగర్‌లోని హస్మీ భవన్‌లో ఆదివారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని విమర్శించారు. అంతేకాకుండా యాప్‌ల భారం, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్షల మూల్యాంకనం, ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు వంటి బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులపై పెరిగిందని, ఇది బోధనా సమయాన్ని తగ్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్ బిల్లులు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. 29 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్, సభ్యులు కొత్తపల్లి రాంబాబు, తాడానా అప్పారావు, అనకాపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా పౌర్ణమి తిరువీధి



బేడామండపంలో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం తిరువీధి వైభవంగా జరిగింది. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో జరగాల్సిన తిరువీధిని చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయ బేడామండపంలో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. పారాయణాలు చేశారు.

## ఇస్కాన్‌లో హరినామస్మరణ

కొమ్మాది: హరేకృష్ణ, హరేరామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం హరినామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆదివారం ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతా రాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు →

